క్లుప్తంగా

ఐక్యమత్యంతో ముందుకు సాగాలి



మానవపాడు: ఐక్యమత్యంతో ముందుకు వెళితే ఏదైనా సాధించవచ్చని జిల్లా ఫొటోగ్రాఫర్ యూనియన్ అధ్యక్షుడు శేఖర్, కోశాధికారి నరసింహయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఫొటో, వీడియో గ్రాఫర్లకు ఐడీ కార్డులు అందించారు. ఈ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసి ప్రతి ఫొటోగ్రాఫర్ కుటుంబం భరోసా కోసం సభ్యత్వం నమోదు చేసుకోవాలన్నారు. వివాహ, శుభకార్యాలకు, ఫంక్షన్లకు వెళ్లేవారు తప్పనిసరిగా తమ ఐడీ కార్డులు తీసుకోని వెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శంకర్, కార్యదర్శి మధు, లక్ష్మీనారాయణ, సీనియర్ ఫొటోగ్రాఫర్ సాధిక్, ఖయూం, రవి, శేఖర్, మల్లి, భాస్కర్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

గద్వాల రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై కేటీదొడ్డి మండలంలోని పలువురు బీజేపీలో చేరినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆమె డీకే బంగ్లాలో పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

గుండె పోటుతో ఇద్దరు మృతి

అయిజ: ఒకేరోజు గుండెపోటుతో ఇద్దరు మృతిచెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. బంధువుల వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన మారెమ్మ (60) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందింది. ఆమెకు నలుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులున్నారు. పట్టణంలోని సంతబజార్‌కు చెందిన అలం ప్రవీణ్ కుమార్ (40)కు సోమవారం రాత్రి గుండెపోటు రావడంతో ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకొని ఇంటికొచ్చాడు. మంగళవారం ఉదయం మళ్లీ గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఒకేరోజు ఇద్దరు వ్యక్తులు గుండెపోటుతో మృతిచెందడంతో పట్టణంలో విషాయద ఛాయలు అలుముకున్నాయి.

ప్రమాదకర మలుపు

పాన్‌గల్: మండల కేంద్రం నుంచి శాగాపూర్ వైపు వెళ్లే పీఆర్ రోడ్డుపై బాలపీర్ల దర్గా వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. మలుపు వద్ద రోడ్డు పక్కనే వ్యవసాయ బావి ఉండటం, మలుపు వద్ద ఏపుగా చెట్లు ఉండటంతో దగ్గరికి వచ్చే వరకు మలుపు, బావి ఉన్నట్లు తెలియక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రతి నిత్యం పెద్ద సంఖ్యలో బాలపీర్ల దర్గాకు భక్తులు వాహనాల్లో వస్తుంటారు. గతంలో దర్గాకు వచ్చిన భక్తుల ట్రాక్టర్ బోల్తాపడి పలువురు గాయాలపాలయ్యారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మలుపు వద్ద ఏపుగా పెరిగిన చెట్ల పొదలను తొలగించి సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, భక్తులు కోరుతున్నారు.

వైద్య శిబిరం

వనపర్తి టౌన్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా యువనాయకుడు హాకీం ఆధ్వర్యంలో ఎస్వీఎస్ ఆస్పత్రి, మెడికల్ కళాశాల సహకారంతో మంగళవారం జిల్లా కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఐఎం పెబ్బేర్ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరం ద్వారా బీపీ, షుగర్, కంటి సమస్యలు, మోకాళ్ల నొప్పులు, చిన్నపిల్లలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, 100 మందికి పైగా మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇసాక్, యూసుఫ్, హర్షద్ ముబిన్ ఆదిల్, ఇర్ఫాన్, ఇమ్రాన్, జాకీర్, ఆరీఫ్ పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయాలి

పెబ్బేరు రూరల్: ఇటీవల వెలువడిన కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో వనపర్తి మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన యువకులు మల్లేష్, వెంకటేష్ యాదవ్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. మంగళవారం గ్రామంలో వారిని సర్పంచ్ కొండన్న గ్రామస్తులతో కలిసి సన్మానించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

అడ్డాకుల: సైబర్ నేరాలకు గురి కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. కనీస అవగాహన కలిగి ఉండాలని మూసాపేట ఎస్ఐ కె.శ్రీనివాసులు సూచించారు. మండల కేంద్రంలోని తాజా వద్ద మంగళవారం సైబర్ నేరాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులను ఎవరు ఓపెన్ చేయవద్దని సూచించారు. ఓటీపీలను ఎవరితోనూ షేర్ చేసుకోవద్దని చెప్పారు. సైబర్ నేరానికి గురైతే 1930 లేదా 100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఖాతాలో డబ్బులను పోగొట్టు కున్నవారు 24 గంటలలోపు ఫిర్యాదు చేస్తే డబ్బులను రికవరీ చేసే అవకాశం ఉందన్నారు.

మిర్చికి తెగులు.. రైతన్నకు దిగులు

- పంటలకు చీడపీడల బెడద
- నీరందక ఎండుతున్న మొక్కలు
- ఆందోళన చెందుతున్న అన్నదాత



ఉండవెల్లి శివారులో సాగు చేసిన మిర్చి పంట

ఉండవెల్లి: ఎర్ర బంగారమైన మిర్చి సాగు చేసి ఆర్థికంగా ఎదగాలని ఆశించిన రైతును ఆదినుంచే కష్టాలు వెంటాడుతున్నాయి. గతేడాది మిర్చి సాగు చేసిన రైతులకు అధికదిగుబడి వచ్చింది. క్వింటాలుకు రూ.22 వేలకు పైగా ధర పలికింది. ఈ ఏడాది మిర్చి సాగు చేసి లాభాలు గడించాలని రైతులు భావించారు. సాగు ప్రారంభం నుంచి భారీ వర్షాల కారణంగా మిరప పంటను రకరకాల తెగుళ్ల ఆసిస్తున్నాయి. వందల ఎకరాల్లో మిర్చి మొక్కలకు వేరు కుళ్లు తెగుళ్ల సోకి, మొక్కలు ఎండిపోతున్నాయి. సెప్టెంబర్‌లో అతి తక్కువ శాతం వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రానున్న నాలుగైదు రోజుల్లోనూ వర్షాలు కురుస్తాయని అధికారులు ప్రకటిస్తుండడంతో ఎలాంటి వర్షాలు కురవకపోవడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం..

అలంపూర్ నియోజకవర్గంలో ఏటా మిర్చి సాగు పెరుగుతుంది. అలంపూర్, ఉండవెల్లి, ఇటిక్యాల, అయిజ, మండలాల్లో రైతులు మిర్చి సాగు చేస్తున్నారు. గతేడాది నియోజకవర్గంలో 100 ఎకరాలకుపైగా సాగు చేశారు. అలంపూర్ డివిజన్‌లో 15 వేల ఎకరాల్లో సాగు చేసినట్లు ఉద్యానవనశాఖ అధికారులు చెబుతున్నారు. ఉండవెల్లి, మానవపాడు గ్రామాల్లో అత్యధికంగా మిర్చి సాగు చేశారని అధికారులు తెలిపారు.

ఆందోళనల్లో అన్నదాతలు..

మార్కెట్లలో మంచి ధరలు ఉండడంతో అధిక లాభాలు వస్తాయని రైతులు మిర్చి సాగు చేశారు. రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టి మిరప సాగు చేసిన రైతులు పంటను కాపాడుకునేందుకు నాలుగైదు సార్లు క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. మిరపసాగు చేసిన వారిలో ఎక్కువ మంది కౌలు రైతులే ఉన్నారు. ఎకర మిర్చి సాగుకు దుక్కి దున్నడం మొదలుకుని ఎరువులు, విత్తనాలు వేసే వాటికి రూ.80 వేల వరకు ఖర్చవుతుంది. కౌలు రైతులకు అదనంగా మరో రూ.10 వేల వ్యయం పెరిగింది. అతి తక్కువ వర్షపాతం రావడంతో మిర్చి పంట దెబ్బతింటోంది. కలుపు పెరిగి తీసేందుకు ఖర్చులే అధికమవడంతో పంటలు చెడిపేస్తున్నారు. ఉద్యానశాఖ అధికారులు మండల స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో రైతులకు సరైన సూచనలు, సలహాలు అందడం లేదు.

వాతావరణ పరిస్థితి దారుణం



వాతావరణ పరిస్థితులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వర్షం నీటితోనే పంటలు పండిస్తారు. ఆర్డీఎస్ నీరు అవసరమున్నప్పుడు వ దలక, అవసరం లేనప్పుడు వదలడంతో పంటలు చేతికొచ్చాక ఇబ్బందులకు గురవుతున్నారు.

– మద్దిలేటి, ఉండవెల్లి, రైతు

జాగ్రత్తలు తప్పనిసరి

నియోజకవర్గంలోనే కాదు, ఎక్కడా వర్షాలు లేవు. వాతావరణంలో మార్పులు లేక వర్షం కురవలేదు. రైతులు సరైన సమయంలో మందులను పిచికారీ చేసే విధంగా అలవాటు చేసుకోవాలి. అధిక శాతం అనేక పంటలు ఎండిపోతున్నాయి.

– సక్రియ నాయక్, ఉండవెల్లి

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరిస్తున్న వైద్య బృందం



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అయిజ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డాక్టర్లు తరుణ్ కుమార్‌రెడ్డి, ఇందిర, ఫార్మసిస్ట్ శంకర్, ఏఎన్‌ఎం పద్మావతమ్మ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ యువతీ యువకులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. యు క్తవయసులో శారీరకంగా, మానసికంగా అనేక మా ర్పులు వస్తుంటాయని, కంగారు పడాల్సిన పనిలేదన్నారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాములు, అ ధ్యాపకులు. సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని ఈర్లబండ, పాతపాలెంలోని జ్వరాలతో బాధపడుతున్నట్లు సర్పంచు నాగ మ్మ, వైద్యాధికారులకు సమాచారం ఇవ్వడంతో వై ద్య బృందం గ్రామంలోని ఇంటింటిని సందర్శించి పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు సీజనల్ వ్యాధులపై జాగ్రత్త ఉండాలని, డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌లపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి జాని వెంకటరాజన్, వైద్యబృందం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతేసంగతులు!



కోతులగిద్ద స్టేజీ సమీపంలో రహదారిపై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

ధరూరు: ఇదిగో ఇక్కడ ఓ వైపు కల్వర్టు దెబ్బతిని రోడ్డు లేవెల్‌లో ఉన్న ఈ దృశ్యం గద్వాల – రాయచూర్ ప్రధాన రహదారిపై మండలంలోని కోతులగిద్ద స్టేజీ సమీపంలో ఉంది. నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డుపై వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచి రోడ్డు దిగినా ప్రమాదం జరగడం ఖాయంగా కనిపిస్తోంది. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు పేర్కొంటున్నారు.

కానిస్టేబుళ్లకు సన్మానం



పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన అన్నదమ్ములను సన్మానిస్తున్న సురేష్

అయిజ: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుళ్ల ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన ముస్తాఫ్, ఆసిఫ్ అన్నదమ్ముళ్లను వారి నివాసంలో 14వ వార్డు కౌన్సిలర్ సీఎం సురేష్ శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కొత్తపేట కాలనీకి చెందిన చాంద్‌బాషా కార్ డ్రైవర్‌గా పని చేస్తూ తన ఇద్దరు కొడుకులను కష్టపడి చదివించినట్లు తెలిపారు. ఒకే ఇంట్లో అన్నదమ్ములకు ఒకేసారి ఉద్యోగాలు రావడం హర్షినీయం అన్నారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ డిపోలో విధులు నిర్వర్తిస్తున్న కండక్టర్ శ్రీనివాస్ నిజాయితీని చాటుకున్నాడు. పెద్దపల్లి గ్రామానికి చెందిన ఎల్లమ్మ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో నాగర్‌కర్నూల్ నుంచి పెద్దముద్దునూర్‌కు వెళ్తోంది. హడావుడిలో ఎల్లమ్మ పర్సు బస్సులో కిందపడింది. గమనించిన బస్సు కండక్టర్ పర్సులో రూ.800లు, కాళ్లమెట్టెలు, తాళిబొట్టు ఉన్నట్లు గుర్తించాడు. దీంతో పెద్దకొత్తపల్లిలో ఆర్టీసీ బస్సు కంట్రోలర్ నిరంజన్‌ను బాధితురాలి పర్సును అందజేశాడు. అధికారులు ప్రయాణికురాలికి సమాచారం ఇవ్వగా మండల కేంద్రంలోని కంట్రోలర్‌ను సంప్రదించింది. దీంతో ప్రయాణికురాలు ఎల్లమ్మకు పర్సును అప్పగించారు. నిజాయితీని చాటుకున్న కండక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బ్యానర్‌పై సంతకాల సేకరణ

పెబ్బేరు రూరల్: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో బ్యానర్‌పై సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో రెండోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అట్టడుగు వర్గాలైన దళిత, గిరిజన మహిళలు, ఇతర పేదలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని అరికట్టాలని, రాజ్యాంగ హక్కులను అమలు చేయాలని కోరుతూ రాష్ట్రపతికి అందించడానికి సంతకాల సేకరణ చేపట్టామని తెలిపారు. జిల్లా కేంద్రంలో జరుగుతున్న సంతకాల సేకరణలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మదన్, గంధం చిన్నగట్టయ్య, నారాయణ, శ్రీనివాసులు, గట్టయ్య, శేషన్న, జయ్యమ్మ, గంధం రాజు పాల్గొన్నారు.

పశువులకు వైద్యశిబిరం



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కేటీదొడ్డి: పశువులకు రోగాలు రాకుండా తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎర్సండొడ్డిలో మంగళవారం పశుసంవర్ధక శాఖ పశువుగణా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధి రాకుండా చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచు గోపాల్ మాట్లాడారు. వ్యాధి బారిన పడిన పశువులకు రోగాలు రాకుండా మంద నుంచి వేరు చేసి చికిత్స చేయించుకోవాలన్నారు. పశువులకు గంజి, మజ్జిగ లాంటి ద్రవపదార్థాలు తాగించాలని తెలిపారు. వచ్చిన అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారి వెంట పశువైద్య సహాయకుడు వెంకటేష్, మోహన్, గోపాల్‌మిత్రలు గోపాల్‌రెడ్డి, బీమయ్య, వెంకటేష్ ఉన్నారు.

కోతులగిద్దలో రోడ్లపైనే మురుగు



కోతులగిద్దలో సీసీ రోడ్లపై పారుతున్న మురుగు



ధరూరు: మండలంలోని కోతులగిద్దలో ఇళ్లలోంచి వచ్చే మురుగంతా రోడ్లపైనే పారుతోంది. ఆయా కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ ఇరు వైపులా డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. రోడ్లపై పారుతున్న మురుగునీరు వల్ల పాదచారులకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తోంది. ఐదేళ్ల క్రితం అన్ని గ్రామాల్లో ఇంటింటికి ప్రభుత్వం ఇంకుడు గుంతలు నిర్మించినా వాటిని ఉపయోగంలోకి తీసుకు రావడం లేదు. ఇటీవల దోమల కారణంగా విష జర్వాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నా, అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు డ్రెయినేజీల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఊకచెట్టు వాగులో చేపపిల్లల విడుదల



ఆత్మకూర్: పట్టణ శివారులోని రామన్‌పాడ్ ఊకచెట్టు వాగులో మంగళవారం మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడు అశ్విన్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 3.35 లక్షల సబ్సిడీ చేపపిల్లలను వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు వీరేష్, భరత్, సంఘం సభ్యులు ధర్మయ్య, వాకిటి లక్ష్మణ్, ఆనంద్, రవి, బాలస్వామి, లక్ష్మీనారాయణ, రాములు, శేఖర్, శివ, శ్రీను పాల్గొన్నారు.

రాజకీయ ఫ్లెక్సీల తొలగింపు

అలంపూర్: ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో రెండు రోజులుగా మున్సిపాలిటీ, పంచాయతీలు, ముఖ్య కూడళ్లలో ఉన్న రాజకీయ ఫ్లెక్సీలు తొలగించడంలో మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బంది మునిగిపోయారు. రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న పుల్లూరు గ్రామ పంచాయతీలోని అలంపూర్ చౌరస్తా కూడలిలోని రాజకీయ ఫ్లెక్సీలను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన తక్షణమే సోమవారం గ్రామ పంచాయతీ సిబ్బంది కొన్ని ఫ్లెక్సీలను తొలగించారు. రాత్రి కావడంతో మంగళవారం సైతం కూడలిలో ఏర్పాటు చేసిన ఆయా రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, ఇతర రాజకీయ సంబంధిత ఫ్లెక్సీలను తొలగించే పనులు కొనసాగించారు. ప్రస్తుతం అలంపూర్ చౌరస్తా కూడలిలోని నాలుగు రోడ్లలో ఉన్న ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. దీంతో కూడలి బోసిపోయి కనిపించింది.

అలంపూర్‌లో బీఎస్పీ జెండా ఎగరేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న మధుగౌడ్

అలంపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో అలంపూర్ నియోజకవర్గంలో బీఎస్పీ జెండాను ఎగరేద్దామని నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధుగౌడ్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ ఎన్నికల సన్నాహక సమావేశం, మండల అధ్యక్షుడు ప్రభుదాస్ ఆధ్వర్యంలో మండల స్థాయి పోలింగ్ బూత్ కమిటీల సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మధుగౌడ్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నీలిజెండాను ఎగరేద్దామన్నారు. నవంబర్ 30వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బీఎస్పీ సిద్ధంగా ఉందన్నారు. గ్రామంలోని యువకులు, రైతులు, మహిళలు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. పోలింగ్ బూత్ కమిటీ సభ్యులు బాధ్యతగా గడపగడపకు ఏనుగు గుర్తును పరిచయం చేసి బీఎస్పీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపాల్, శోభ గౌడ్, ప్రభుదాస్, శివశంకర్ గౌడు, నాగేంద్ర, పోలింగ్ బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగిన వాహనాల తనిఖీ

అలంపూర్: రాష్ట్ర సరిహద్దులోని బార్డర్ చెక్‌పోస్టులో వాహన తనిఖీలు మంగళవారం కొనసాగించారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద సరిహద్దు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మీదుగా వస్తున్న వాహనాలను టోల్‌ప్లాజా చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేసిన అనంతరం రాష్ట్రంలోకి ప్రవేశించడానికి అవకాశం కల్పించారు. అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించన అనంతరం ప్రవేశానికి పోలీసులు అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం ఇక్కడ పోలీసులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బుధవారం నుంచి అన్ని శాఖల అధికారులతో చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేయడానికి సన్నహాలు చేయనున్నారు. దీంతో సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద మరింత కట్టుదిట్టం చేయడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ప్రయాణికుల పాట్లు

- బస్సు షెల్టర్లు లేక అవస్థలు
- స్టేజీల వద్ద ఎదురుచూపులు
- పట్టించుకోని అధికారులు



మల్దకల్‌లో బస్సుకోసం రోడ్డుపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల స్టేజీల వద్ద బస్సుషెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణికులే తమ సంస్థకు దేవుళ్లని చెప్పుకునే ఆర్టీసీ అధికారులు సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. వేసవిలో ఎండలకు, వర్షకాలంలో వానలకు తడుస్తూ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గద్వాల–అయిజ ప్రధాన రహదారిలో మల్దకల్ మండలంలోని పెద్దపల్లి, బూడిదపాడు, అమరవాయి, మల్దకల్, శేషంపల్లి, తాటికుంట స్టేజీల నుంచి నిత్యం ప్రయాణికులు వందల సంఖ్యలో పట్టణ ప్రాంతాలకు వెళ్తుంటారు. ధరూరు మండలంలోని వివిధ స్టేజీల వద్ద, గట్టు, కేటీదొడ్డి, గద్వాల మండలాల్లోని బస్సు స్టేజీల వద్ద షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులకు ఆదాయంపై ఉన్న శ్రద్ధ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించే విషయంలో లేదని ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలో 10వేలకు పైగా జనాభా ఉండడం, జోగుళాంబగద్వాల జిల్లాలో ప్రముఖ క్షేత్రంగా మల్దకల్ తిమ్మప్పస్వామిని దర్శించుకునేందుకు భక్తులు వందల సంఖ్యలో వస్తుంటారు. నాయకులు బస్టాండ్ నిర్మిస్తామని హామీలు ఇస్తున్నా అమలుకు నోచుకోకపోవడంతో నిర్మాణం కలగానే మిగిలింది. ఈ విషయం పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆయా స్టేజీల వద్ద బస్సు షెల్టర్ల నిర్మాణం చేపట్టి ప్రయాణికులకు సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు.

బస్సు షెల్టరు నిర్మించాలి



మండల కేంద్రంలో ప్రముఖ క్షేత్రమైన ఆదిశిలా క్షేత్రం ఉండడంతో ప్రతి శనివారం వందలాది మందిభక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు వస్తుంటారు. గ్రామాల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి బస్సు షెల్టరు నిర్మించాలి.

– రామాంజనేయులు, మల్దకల్

ఇబ్బందులు తప్పడం లేదు



బస్సు ఎప్పుడు వస్తుందో తెలియక రోడ్డుపై ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. బస్సు షెల్టరు లేకపోవడంతో ఎండలో ఉండాల్సిన పరిస్థితి ఉంది. బస్సు వచ్చే వరకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు బస్సు షెల్టరు నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– తిమ్మన్న, అమరవాయి

చర్యలు తీసుకుంటాం..



నియోజకవర్గంలోని ఆయా స్టేజీల వద్ద బస్సు షెల్టర్ల నిర్మాణం కోసం ప్రయాణికుల వినతి మేరకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. అధికారుల సూచన మేరకు ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– మంజుల, గద్వాల డిపో మేనేజర్

రుణమాఫీలో గందరగోళం తొలగించాలి

కొత్తకోట రూరల్: ఐదేళ్ల క్రితం ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ నేటికీ పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడంతో రైతుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సత్యారెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యారెడ్డి మాట్లాడుతూ 2018 నాటికి రూ.లక్ష రుణమాఫీ ఎలాంటి అడ్డంకులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇద్దరు అన్నదమ్ములు ఉంటే 2018 ముందే వేరువేరుగా ఉన్న వారికి రూ.లక్ష రుణమాఫీ కావడం లేదని, ఏ అధికారిని అడిగినా సరైన సమాధానం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగి విసిగిపోయిన పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా రుణమాఫీకి అర్హత ఉన్న రైతులకు రుణమాఫీ కావడం లేదని దుయ్యబట్టారు. రుణమాఫీ అయిన రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వకపోవడంతో వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతారని వాపోయారు. విజయభాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి, ముజఫర్ ఉన్నారు.